● ఉత్కంఠ కథ

# నా హంతకుడు ఎవరు?

◆ అనితా వొజ్జల ◆

సమయం రాత్రి పదకొండున్నర. ఎంత ప్రయత్నించినా నిద్రపట్టడం లేదు పరంధామయ్యకు.



వాతావరణమంతా నిశ్శబ్ధంగా వుంది.


పదినిమిషాల తరువాత ఆ నిశ్శబ్ధాన్ని భంగపరుస్తూ పడమటి వైపు నుంచి గాలి ఉధృతంగా వీచింది.

క్షణం తరువాత మరింత వేగంగా వీయ సాగింది. వెను వెంటనే వర్షం మొదలై రెండు నిమిషాల్లోనే తారాస్థాయిని అందుకుంది.

అప్రయత్నంగా ప్రక్కరూమ్‌లోకి తొంగి చూసాడు.

భార్య సావిత్రి గాఢంగా నిద్రపోతుంది.

వేగంగా వీచే గాలితోపాటు వర్షం జల్లు లోపలకి రాసాగింది.



వరంధామయ్య వెంటనే లేచి కిటికీలన్ని మూసివేసాడు. వాడ్‌రోబ్‌లోని బ్లాంకెట్ తీసి భార్యకు కప్పాడు. నిద్రరాకున్నా కృష్ణా... రామా... అని మనసులో దేవుణ్ణి ప్రార్థిస్తూ మంచంపైన పడుకున్నాడు.

ఓ అరగంట తరువాత మాగన్నుగా నిద్రపట్టింది.

అప్పుడే 'ట్రింగ్... ట్రింగ్...' అంటూ ఫోన్ మ్రోగసాగింది.

నిద్రపోబోతున్నవాడల్లా విసుగ్గాలేచి ఫోన్ అందుకొని "హలోవ్" అన్నాడు వరంధామయ్య.

"వరం... నువ్వేనా?" అని వినిపించింది అటువైపు నుంచి.

అప్పుడే గాలి దిశ మారడం వలన తెరిచివున్న బాల్కనీ తలుపు నుంచి గాలితో పాటు వర్షం రివ్వున దూసుకొచ్చి అతన్ని పూర్తిగా తడిపేసింది.

శరీరం ఒక్కసారి జల్లుమనడంతోపాటు హృదయం అప్రయత్నంగా వణికింది వరంధామయ్యకు.

"ఆ...! ఆ...! నేనేరా... సోమూ! ఏమిటి విశేషం...?" అన్నాడు వరంధామయ్య తన స్నేహితుడు అర్ధరాత్రి ఫోన్ ఎందుకు చేసాడోనని ఆశ్చర్యపోతూ.

"నువ్వోసారి అర్జంట్‌గా ఇంటికిరా" వినిపించింది అటువైపు నుంచి కంగారుగా.

"ఇప్పుడా...! ఏరా...! ఈ అర్ధరాత్రి పేకముక్కలు ఆడుకోవాలని వుందా...!" అన్నాడు వరంధామయ్య తేలిగ్గా.

"జోక్ చెయ్యడానికి ఇది సమయం కాదు! నువ్విపుడు వెంటనే బయలుదేరిరా!"

"ఎందుకురా...? ఏమిటి విశేషం" అన్నాడు వరంధామయ్య ఏనుగు తన తొండంతో నీళ్ళు పోస్తున్నట్లు కురుస్తున్న వర్షాన్ని చూస్తూ.

"ముందు నువ్వు రారా."

"ఇక్కడ వర్షం బాగా కురుస్తుంది రా! అయినా ఇప్పుడు బాగా రాత్రయింది! రేపొద్దున వస్తాలే...!"

"ఆ విషయం నాకు తెలుసురా! రోడ్లన్ని మొకాళ్ళ లోతు నీళ్ళతో నిండిపోయాయి. అయినా తప్పదు! త్వరగా బయలుదేరూ..."

"అసలు విషయం ఏమిటో చెప్పు" అని వరంధామయ్య అన్నా తన స్నేహితుడు అర్ధరాత్రి ఎందుకు రమ్మని అడుగుతున్నాడో అర్థం కాక మనసులో ఆలోచనలు సుళ్ళులా తిరగసాగాయి.

"అసలే టెన్షన్‌లో వున్నాను! ప్లీజ్! త్వరగా బయలుదేరు."

"ఆ...! ఇప్పుడే వస్తున్నా!"

"క్విక్! త్వరగా వచ్చేయ్."

"అలాగే..." అంటూ ఐదు నిమిషాల్లో తయారయి బయటకొచ్చి కారు స్టార్ట్ చేసాడు వరంధామయ్య.

రోడ్డంతా ఖాళీగా వుంది. చుట్టూ చిమ్మ చీకటి... అక్కడక్కడ మాత్రమే వీధి దీపాలు వెలుగుతున్నాయి.

వర్షం జోరు మరింత ఎక్కువైంది. గాలి ఉధృతంగా వీయసాగింది. రోడ్డు మీద నీరు వేగంగా ప్రవహించసాగింది.

ఎంత జాగ్రత్తగా డ్రైవ్ చేస్తున్నా... కారు వేగాన్ని అందుకోలేకపోతుంది. దానికి తోడు టెన్షన్ ఎక్కువైంది వరంధామయ్యకు.

అలా కంగారుగానే కారును సోమసుందరం ఇంటి ముందు ఆపాడు వరంధామయ్య.

అప్పటికే బయట నిలబడి వున్నాడు సోమసుందరం. ఆశ్చర్యంగా స్నేహితుడివైపు చూసాడు వరంధామయ్య. మనిషి ఏడు లంకణాలు చేసినట్లు వున్నాడు. మొహమంతా పీక్కుపోయి... రక్తం లేకుండా పాలిపోయినట్లు వుంది. మనిషి నిలువెల్ల టెన్షన్‌తో కంపించిపోతున్నాడు.

ఇద్దరి మధ్య మౌనం నిశ్శబ్దంగా రాజ్యమేలసాగింది.

ఇక మౌనాన్ని భరించలేనట్లు "ఏమిటి సోమూ...? ఎమయ్యింది? ఇంత రాత్రి ఫోన్ చేసి ఎందుకు రమ్మన్నావ్?" అని అడిగాడు వరంధామయ్య ఆశ్చర్యంగా.

సోమసుందరం ఏమీ మాట్లాడలేదు.

◆ ◆ ◆

**మంచం మీద పడుకొని నిద్ర పోతుంటే పడుకోలేదంటావ్ నీకేమయినా మతిపోయిందా?**

◆ ◆ ◆



## 'తండ్రి మాటంటే లెక్ఖ లేదు'

తండ్రి 'మహేష్‌భట్' లేకపోతే 'పూజాభట్' ఈనాడు ఈ స్థితిలో ఉండేది కాదు. అది మరిచిపోయిందేమో, ఈ మధ్య మహేష్‌భట్ చిత్రం 'తడిపార్' ఆడియో కేసెట్ల ఆవిష్కరణ సభలో నానా గొడవ చేసింది. ఆనాటి సభకు సంగీత దర్శకుడు అన్నుమాలిక్ ఆలస్యంగా వచ్చాడు. అతను వచ్చేలోపు మిగతావారు ఓపిగ్గా వున్నా పూజాభట్ అసహనంతో తన ప్రేమికుడితో కల్సిపోతానని అల్లరి చేసింది. 'అన్నుమాలిక్ వచ్చేసరికి ఆమె వెళ్ళిపోబోతుంటే మహేష్ గొంతు చించుకుని అరచినా వినకుండా చెట్టాపట్టాలేసుకుని వెళ్ళిపోయింది.

---

చూపుడు వ్రేలితో బెడ్‌రూమ్ వైపు చూపించాడు.

వరంధామయ్య అయోమయంగా అటువైపు చూసాడు. కానీ, ఏమీ అర్థం కాలేదు. ఇక భరించలేనన్నట్లు "ఏమయ్యిందిరా!" అన్నాడు ఆతృతగా

"అక్కడా..." అన్నాడు సోమసుందరం చూపుడు వ్రేలితో చూపిస్తూ.

"ఏముందక్కడా...! దయ్యమా...! భూతమా!"

"కాదు! అంతకన్నా భయంకరమైనది."

"ఏమిటది."

"నా భార్య."

"అవును! పార్వతి నీ భార్యే! పడుకుందిగా!"

"పడుకోలేదు."

"మంచం మీద పడుకొని నిద్రపోతుంటే పడుకోలేదంటావ్! నీకేమయినా మతిపోయిందా?"

"పోయింది! కానీ... నా మతి కాదు... అది"

"అదా!"

"అదే! నా భార్య చచ్చిపోయింది!" అతని కళ్ళు అగ్నిగోళాల్లా వున్నాయి. చూపులు ఎటో శూన్యంలోకి చూస్తున్నాయి. మనిషి ఈ లోకంలో లేనట్లే వున్నాడు.

ఆ మాటలకి వరంధామయ్య స్థబ్దుడైపోయాడు. ఐదు నిమిషాల తరువాత తేరుకున్నాడు. అప్పటికే అతని హృదయంలో కవ్వంతో చిలికినట్లయ్యింది. తనను తాను కంట్రోలు చేసుకుంటూ

"చ...చ్చి...పోయిందా!" అని అడిగాడు.

"అవును! నేనే చంపేసాను" అన్నాడు సోమసుందరం సీరియస్‌గా.

"నువ్వా...!" అన్నాడు వరంధామయ్య. ఈసారి ఆశ్చర్యంతోపాటు కాస్త భయం కలిగింది.

"ఆ! నేనే చంపేసాను" అన్నాడు సోమసుందరం.

ఆ మాటలకి గుండెల్లో గునపంతో గుచ్చినట్లయ్యింది వరంధామయ్యకు. "నీకేం పోయే కాలంరా! ఈ అరవైయేళ్ళ వయస్సులో ఇదేం పని!"

"ఏం చెయ్యను! మరీ విసిగిస్తుంటే."

"విసిగిస్తున్నారని భార్యలను చంపుకుంటారా?"

"నలభైయేళ్ళ నుంచి అనుభవిస్తున్నా... ఇంకెంత కాలంరా! నేను భరించలేను. పెళ్ళయిన పుటి నుంచి నా స్వేచ్ఛను కోల్పోయాను! నీకు తెలుసుగా... దాని గయ్యాళితనం! నాకు దేనికి స్వాతంత్ర్యంలేదు. ఎప్పుడు తన మాటే నెగ్గాలి. ప్రతీదానికి నాదే తప్పు అంటుంది. నిజం చెప్పినా నమ్మదు. ఏం చెయ్యనురా! ఇన్ని రోజులు వయస్సులో వున్నవాణ్ణి కాబట్టి అనుభవించాను! నాకిపుడు వయస్సు మీద పడింది. ఓపిక నశించింది! దాని రాక్షసత్వం రోజు రోజుకి ఎక్కువవుతుంటే భరించలేకపోయా! ఈ మునలితనంలో నైనా స్వేచ్ఛగా బ్రతుకుదామనుకుంటున్నా! అందుకేచంపేసాను" అన్నాడు సోమసుందరం చెప్పడం పూర్తయినట్లు...

◆ ◆ ◆

**చుట్టూ చిమ్మ చీకటి... అక్కడక్కడ మాత్రమే వీధి దీపాలు వెలుగుతున్నాయి.**

◆ ◆ ◆

"పోనీలే! ఎన్ని రోజులని కష్టపడుతావ్!" అని ఓ క్షణం ఆగి

"ఇంతకీ ఎలా చంపావ్!" అన్నాడు ఎగ్జయిటింగ్‌గా.

"అటువైపు తిరిగి ఏదో పని చేసుకుంటుంది. ఇటు వైపు నుంచి తాడుతో గట్టిగా మెడకు బిగించి చంపాను."

"చచ్చిపోయిందా!"

"ఆ...!"

"తాడు తగలగానే వెనక్కు తిరిగి చూడలేదా! నువ్వే చంపుతున్నావని ఆమెకు తెలుసా?"

"మెడ కదలకుండా గట్టిగా కట్టాను! అయినా కళ్ళెత్తి చూడటానికి ప్రయత్నించింది. కాని కొద్ది నిమిషాల్లో ఎలాగూ చనిపోతుందిగా... ఆ...! ఏం చేస్తుందిలే అనుకున్నాను"

"ఆ గుడ్లు నిశ్చలంగా అప్పటి నుండి అలాగే వున్నాయా! అంటూ భయంగా కళ్ళు మూసుకున్నాడు వరంధామయ్య.

అప్పటికి వర్షం కాస్త తగ్గింది. కానీ, గాలి ఉధృతం ఏమాత్రం తగ్గలేదు. చూరు నుంచి నీరు ధారాళంగా క్రింద పడుతుంది.

"అయితే ఇపుడేమంటావ్! ఈ శవాన్ని ఏం చేద్దామని" అన్నాడు వరంధామయ్య కాస్త తేరుకుంటూ.

"అదే నాకు అర్థం కాక నిన్ను రమ్మన్నాను! నా ఐడియా ఏమిటంటే ఇంటి వెనుక ఈశాన్యం మూల పది అడుగుల లోతైన అండర్ గ్రౌండ్ సిమెంటు ట్యాంకు వుంది. దాంట్లో వేసి నిండా మట్టి కప్పేస్తే పోలా?" అన్నాడు సోమసుందరం ప్రాబ్లమ్ సాల్వ్ చేస్తున్నట్లు

వరంధామయ్య ఆలోచిస్తున్నట్లు రెండు క్షణాలు గడ్డం గోక్కొని ఆ తరువాత "అదే తేలిక! కాని ఆ తరువాత ఎవరైనా దాని మూత తెరిస్తే?" అన్నాడు.

"ఆ భయం అక్కరలేదు. దాని తాళాలు ఎప్పుడు నా యజ్ఞోపవీత్రానికే వుంటాయి"

"ప్లాను చాలా బాగుంది! ఆ పనేదో త్వరగా

కానిచ్చేద్దాం! ఇప్పటికే బాగా ఆలస్యమైంది" అన్నాడు వరంధామయ్య.

వెంటనే ఇంటి వెనుక లైట్లు వేసాడు సోమసుందరం.

తరువాత తాళం చెవితో ట్యాంకు తాళం వూడదీసి మూత తెరిచాడు. దానితో ట్యాంకుపైన నాలుగో వంతు భాగం తెరుచుకుంది. మిగిలినదంతా సిమెంటుతో ప్లాస్టింగ్ చేయబడి వుంది. నాలుగోవంతు మాత్రమే తెరుచుకునేటట్లు సిమెంటు మూత అమర్చబడి వుంది.

ఇద్దరూ కలిసి శవాన్ని తీసుకొచ్చి ట్యాంకులో వేసారు. ప్రక్కన రేకుల షెడ్‌లో వున్న పొడి మట్టిని తీసుకొచ్చి ట్యాంకు నిండా నింపారు.

ఆ తరువాత తాళం వేసి చేతులు దులుపుకొని లోనికి వెళ్ళారు.

"ఈ సమస్య ఇంత త్వరగా పరిష్కారమవుతుందని అనుకోలేదురా. ఇక నాకు జీవితమంతా స్వేచ్ఛనే అహాహాహా...!" అంటూ గట్టిగా నవ్వి సిగార్ వెలిగించి నోట్లో పెట్టుకున్నాడు సోమసుందరం.

"కొన్ని రోజులకు వాసన వస్తుందేమో" అన్నాడు వరంధామయ్య అనుమానంగా.

"ఇక్కడ చుట్టు ప్రక్కల ఇళ్ళు లేవు! నేను వచ్చేవారంలో అమెరికా వెళ్తున్నానురా! మళ్ళీ వచ్చేవరకూ అంతా సర్దుకుంటుంది" అన్నాడు సోమసుందరం.

"ఇప్పటికి ఫ్రీ బర్డ్ అయ్యావన్నమాట! ఇక నే వెళ్తారా!" అంటూ లేచాడు వరంధామయ్య.

"సరే!" అన్నాడు సోమసుందరం.

అప్పుడే ఆకాశంలో మెరుపు... వెంటనే ఉరుము... వెనువెంటనే వర్షం కుంభవృష్టిలా కురవసాగింది.

కాలు బయట పెట్టబోతున్న వాడల్లా ఒక్షణం ఆగాడు వరంధామయ్య.

"వర్షం బాగా కురుస్తుంది వరం! కాసేపు ఆగు...! అన్నాడు సోమసుందరం.

◆ ◆ ◆

**మొహమంతా పీక్కుపోయి... రక్తం లేకుండా పాలిపోయినట్లు వుంది.**

◆ ◆ ◆

వెనక్కి వచ్చి కూర్చున్నాడు వరంధామయ్య.

భార్యతో తను అనుభవించిన బాధలన్నీ చెప్పసాగాడు సోమసుందరం.

అలా రెండు గంటలు గడిచాయి.

వర్షం తగ్గలేదు కానీ మరింత ఎక్కువైంది.

"నే వెళ్తారా!" అంటూ లేచాడు వరంధామయ్య.

"వర్షం ఎక్కువయ్యిందిరా! తగ్గాక వెళ్ళువుగాని" అన్నాడు సోమసుందరం.

"పర్లేదు! సావిత్రి ఎదురు చూస్తుందేమో... తను నిద్రపోతుంది లేవటం ఎందుకని చెప్పి రాలేదు."

"సరే! నీ ఇష్టం!"

"వస్తాను"

"సరే!"

వరంధామయ్య వర్షంలో తడుస్తూనే వేగంగా కారు దగ్గరికి వెళ్ళి తలుపులు తీసి కార్లో కూర్చున్నాడు.

ఎంత వేగంగా వెళ్ళినా పూర్తిగా తడిసిపోయాడు. బట్టలు పూర్తిగా తడిసిపోయాయి. ఒళ్ళంతా చలి చంపసాగింది.

కారు స్టార్ట్ చేసి గట్టిగా ఎక్సిలేటర్ నొక్కాడు. అసలే గతుకుల రోడ్డు... దానికి తోడు ధాటిగా వర్షం ఎదుటి నుండి కురుస్తుండటం వలన డ్రైవ్ చేయడం కష్టమవసాగింది. అయినా దానిని లెక్క చేయకుండా కారు వేగాన్ని పెంచాడు వరంధామయ్య.

అప్పుడే ఎవరో స్త్రీ రోడ్డు కడ్డంగా పరుగెత్తుకుంటూ వచ్చి 'లిఫ్ట్' అన్నట్లు చెయ్యి వూపింది.

వరంధామయ్య మెదడంతా బ్లాంక్‌గా వుంది. కానీ... అడుగుతుంది స్త్రీ అని... అది అర్ధరాత్రి పూట అని... సహాయం చెయ్యటం తన కనీస ధర్మమని గుర్తొచ్చి కారు ఆపి తలుపులు తెరిచాడు.

ఆమె ఎక్కగానే కారు వేగాన్ని అందుకుంది.

"మేడమ్! మీరు ఎక్కడికి వెళ్ళాలి" అని అడిగాడు వరంధామయ్య రోడ్డు మీదకు చూస్తూ...

సమాధానం అతనికి వినిపించలేదు.

"మీరు ఎక్కడికి వెళ్ళాలండి" అని అడిగాడు మరోసారి.

మళ్ళీ సమాధానం రాలేదు.


ఆశ్చర్యంగా తల త్రిప్పి ప్రక్కకు తిరిగి చూసాడు వరంధామయ్య.

తెల్లచీర... విరబోసుకున్న జుట్టు... రూపాయి బిళ్ళంత కుంకుమ బొట్టు... ఆమె... ఆ-మె-సోమసుందరం భార్య పార్వతి...

"నన్ను చంపినదెవరూ? నా హంతకుడు ఎవరు?" అని అడిగింది అమాయకంగా.

అప్రయత్నంగా అతడు పెట్టిన కేక గొంతు నుండి వెలువడక ముందే స్టీరింగ్ చుట్టూ వ్రేళ్ళు గట్టిగా బిగుసుకున్నాయి.

●



## 'ఒకే రోజులో 28 పాటలు పాడాడు'

'కిశోర్ కుమార్, మహమ్మద్ రఫీ'ల తరువాత 'కుమార్‌సాను' ఎక్కువ పాటలు పాడుతూ అత్యంత ప్రేక్షకాధరణను పొందుతున్నాడు. ఆ మధ్య అతను ఒకే రోజులో 28 పాటలు పాడాడన్న వార్త అన్ని పత్రికలలో వచ్చింది. కాని అది అబద్ధం అని మరో గాయకుడు అభిజిత్ కోర్టుకెక్కాడు. దానికి జవాబుగా అన్ని పత్రికలకు ఇచ్చాడు. అతను 18-8-92న స్టెర్లింగ్ రికార్డ్స్ అండ్ కాసెట్స్ కంపెనీ కోసం విక్రమ్ మోరె అనే రికార్డిస్టు సమక్షంలో 28 పాటలు పాడాడట!